# నమస్తే తెలంగాణ
# కామారెడ్డి

5 | నిజామాబాద్, సోమవారం 4 మార్చి 2024 | KAMAREDDY






*కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి(1973-74 బ్యాచ్) విద్యార్థులు స్థానిక రోటరీ క్లబ్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 50 ఏండ్ల తర్వాత కలుసుకోవడంతో భావోద్వేగానికి గురయ్యారు. ఒకరికొకరు కష్టసుఖాలను తెలుసుకొన్నారు.*

*-కామారెడ్డి, మార్చి 3*



## పోచారం ప్రాజెక్టును పరిశీలించిన జీఆర్ఎంబీ చైర్మన్

ఎల్లారెడ్డి, మార్చి 3 : నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టును గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ)చైర్మన్ ముకేశ్‌కుమార్ సిన్హా ఆదివారం పరిశీలించారు. వందేండ్ల క్రితం నిర్మించిన ప్రాజెక్టులో నీటి లభ్యత, నిల్వ వివరాలను ఆయన నీటి పారుదల శాఖ డిప్యూటీ ఇంజినీర్ వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బోర్డుకు సంబంధించిన పలువురు అధికారులు ఉన్నారు.

*నిజామాబాద్ నగరంలోని జీజీ కళాశాల మైదానంలో నిర్వహించిన తైక్వాండో శిక్షణలో పాల్గొన్న 11వేల మంది విద్యార్థినులు, ఉద్యోగినులు, మహిళలు*





# శిక్షణ.. స్వీయ రక్షణ



- లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు
- ఇందూరులో లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహణ
- పాల్గొన్న విద్యార్థినులు, మహిళా ఉద్యోగులు

ఖలీల్‌వాడి/వినాయక్‌నగర్, మార్చి 3: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో స్వీయ రక్షణపై విద్యార్థినులు, మహిళా ఉద్యోగులకు ఆదివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమం అరుదైన ఘనత సాధించి, లిమ్కా బుక్‌ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నది. జిల్లా పోలీసుశాఖ సహకారంతో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో స్వీయ రక్షణ (తైక్వాండో)పై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థినులతోపాటు వివిధ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగినులు పాల్గొని రికార్డు సృష్టించారు. ఏకకాలంలో 11వేల మంది శిక్షణలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించి 'లిమ్కా బుక్ రికార్డ్స్'లో చోటు దక్కించుకున్నారు. విజయవంతంగా కొనసాగిన ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించిన లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు, శిక్షణ తరగతులు ముగిసిన అనంతరం అవార్డు ప్రకటించి జిల్లా జడ్జి సునీత కుంచాలకు మెడల్‌ను బహూకరించారు.ఉదయం 8 నుంచి 10 గంటలకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి, జిల్లా జడ్జి సునీత కుంచాల, సీపీ కల్మేశ్వర్ హాజరయ్యారు. తైక్వాండో కోచ్ మనోజ్ పర్యవేక్షణలో విద్యార్థినులు, యువతులు ఎంతో అలవోకగా స్వీయరక్షణ టెక్నిక్‌లను ప్రదర్శిస్తూ తమ ప్రతిభను చాటుకున్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయశాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, న్యాయవాదులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాల విద్యార్థినులు, ఉద్యోగినులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.





న్యాయ సేవాధికార సంస్థ రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా జడ్జి సునీతా కుంచాలకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధులు

### స్వీయ రక్షణ పద్ధతులు నేర్చుకోవాలి



నేటి సామాజిక పరిస్థితుల్లో బాలికలు, మహిళలు స్వీయరక్షణ పద్ధతులను నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. శారీరకంగా, మానసికంగా దృఢత్వాన్ని పెంపొందించుకోవాలి. అప్పుడే జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోగలుగుతారు. జాతీయ స్థాయిలోనే కాకుండా ఆసియా స్థాయిలో రికార్డు నెలకొల్పేలా బాలికలు, మహిళలు వేలాదిగా తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినందనీయం. అందరి కృషి, అంకితభావంతోనే లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ నమోదైంది.

**- ఎస్.గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి**

### పట్టుదల, కృషితోనే ఇది సాధ్యమైంది



లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను శిక్షణలో పాల్గొన్న విద్యార్థినులు, యువతులకు అంకితం చేస్తున్నాం. బాలికలు, మహిళల పట్టుదల, కృషితోనే ఇది సాధ్యమైంది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలికలు, మహిళలకు స్వీయ రక్షణపై అవగాహన కార్యక్రమాన్ని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించగా.. విశేష స్పందన వచ్చింది. ఆ స్ఫూర్తిని కొనసాగిస్తూ ఇప్పటివరకు 14 వేల మందికి శిక్షణ ఇప్పించాం. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తోడ్పాటునందించిన జిల్లా యంత్రాంగం, పోలీసు తదితర శాఖల అధికారులను అభినందిస్తున్నాం.

**- సునీతా కుంచాల, జిల్లా జడ్జి**

### పది మందికి నేర్పించాలి..



స్వీయరక్షణ పద్ధతులను నేర్చుకున్న వారు ఒక్కొక్కరు కనీసం మరో పది మందికి వాటిని నేర్పాలి. తద్వారా లక్ష మందికి పైగా స్వీయ రక్షణ శిక్షణ పొందినట్లు అవుతుంది. శిక్షణను నిలిపివేయకుండా ముమ్ముందు కూడా కొనసాగించాలి.

**-కల్మేశ్వర్, సీపీ**

## దుకాణాలకు రాత్రివేళ సమయం సడలింపు

వినాయక్‌నగర్, మార్చి 3: రాబోయే రోజుల్లో మహాశివరాత్రి, గుడ్ ఫ్రైడే, రంజాన్, ఉగాది, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి తదితర పండుగలను పురస్కరించుకొని సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ ఆదేశాల మేరకు సమయం సడలింపు చేసినట్లు తెలిపారు. ప్రజల సౌలభ్యం కోసం ఏప్రిల్ చివరి వరకు కమిషనరేట్ పరిధిలోని వ్యాపార సముదాయాలకు రాత్రి 10.30 నుంచి రాత్రి 12 గంటల వరకు మినహాయింపు ఇవ్వాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

## 15 నుంచి ఒంటిపూట బడులు

ఖలీల్‌వాడి, మార్చి 3: ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఈనెల 15 నుంచి ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు కొనసాగుతాయని జిల్లా విద్యాభివృద్ధి అధికారులు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు కొనసాగుతాయని, 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించే పాఠశాలల్లో మాత్రం మధ్యాహ్నం తరగతులు నిర్వహించనున్నారు.


## జిల్లా స్థాయి సైక్లింగ్ టీం ఎంపిక

కంఠేశ్వర్, మార్చి 3 : నగరంలోని బైపాస్‌రోడ్డులో సైక్లింగ్ పోటీలను జిల్లా సైక్లింగ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఎంపికైన వారు ఈనెల 9, 10వ తేదీల్లో మెదక్ జిల్లాలోని రామాయంపేట్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి మౌంటెన్ బైక్ సైక్లింగ్ చాంపియన్ పోటీల్లో పాల్గొననున్నట్లు సంఘం కార్యదర్శి భూలోకం విజయకాంత్‌రావు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నిర్వహణ కార్యదర్శి రాకేశ్ కుమార్, సభ్యులు ఆకుల నరేశ్ కుమార్, వినోద్, యెండల రామ్, టీం కోచ్ రాగుల నరేశ్ కుమార్, టీం మేనేజర్ గడ్డం రవి పాల్గొన్నారు.

# పల్స్ పోలియో విజయవంతం

**కామారెడ్డిలో 96.2శాతం, నిజామాబాద్‌లో 95.13శాతం నమోదు**





బాన్సువాడలో చిన్నారికి చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే పోచారం, వేల్పూర్‌లో పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే వేముల

వేల్పూర్/ బాన్సువాడ టౌన్/కామారెడ్డి/ ఖలీల్‌వాడి, మార్చి 3: ఉమ్మడి జిల్లాలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ దవాఖానలతోపాటు బస్టాండ్లు తదితర ప్రాంతాల్లో పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని ఐదేండ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. బాన్సువాడ మాతా శిశుదవాఖానలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, వేల్పూర్‌లో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు చుక్కల మందు వేసిన అనంతరం వారు మాట్లాడారు. పిల్లలను పోలియో మహమ్మారి నుంచి కాపాడుకోవడానికి తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పిల్లల ఆరోగ్యం బాగుంటేనే సమాజం బాగుంటుందని పేర్కొన్నారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి క్షేత్రస్థాయిలో పనిచేసిన వైద్యబృందం, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలను అభినందించారు. పోలియో చుక్కలు వేసుకోలేని పిల్లలు ఎవరైనా ఉంటే ప్రతిఒక్కరిని గుర్తించి, వారికి కూడా పోలియో చుక్కలు వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**కామారెడ్డిలో 96.2, నిజామాబాద్‌లో 95.13శాతం..**

కామారెడ్డి జిల్లాలో మొత్తం 1,02,555 చిన్నారులుండగా ఆదివారం 98,646 మందికి పోలియో చుక్కలు వేశారు. పల్స్ పోలియో కార్యక్రమం 96.2శాతంగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో ఐదేండ్లలోపు 1,91,081 పిల్లలు ఉండగా 1,81,781 మందికి పోలియో చుక్కలు వేసినట్లు డీఎంహెచ్‌వో సుదర్శనం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 95.13శాతం నమోదైనట్లు పేర్కొన్నారు. మిగిలిన చిన్నారులకు సోమ, మంగళవారం ఇంటింటికీ వెళ్లి వైద్య సిబ్బంది చుక్కల మందు వేస్తారని తెలిపారు.

# వారసత్వ సంపదను రక్షించుకోవాలి

**బావుల పునరుద్ధరణతో భూగర్భ జలాల వృద్ధి**

**కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 3: పురాతన బావుల పునరుద్ధరణతో భూగర్భ జలాలు పెరుగుతాయని కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని కోదండరామాలయం, గోపాలస్వామి ఆలయాల్లో ఉన్న పురాతన బావుల పరిశుభ్రత పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వారసత్వ సంపదను అందరూ రక్షించుకోవాలన్నారు. బావులు జలకళను సంతరించుకుంటే పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయన్నారు. ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టి వినియోగంలోకి తేవాలన్నారు. బావుల చరిత్రను తెలిపే బోర్డును ఏర్పాటు చేయాలని, బావుల చుట్టూ గ్రీనరీని పెంచాలన్నారు. ఎల్లారెడ్డి పరిసరాల్లో ఏవైనా చారిత్రక విగ్రహాలు, శిల్పసంపద దొరికితే వాటిని తీసుకొచ్చి బావుల చుట్టు పక్కల ఏర్పాటు చేయాలన్నారు. గార్డెనింగ్ చేసి సాయంత్రం వేళల్లో కూర్చుండేందుకు వీలుగా బెంచీలను పెట్టాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో మన్నె ప్రభాకర్, తహసీల్దార్ అల్లం మహేందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, గిర్దావర్ శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తలు సిద్ది రాజులు, సిద్ధి శ్రీధర్, సిద్ధి చంద్రప్రకాశ్, సిద్ధి భైరు, ఎస్సై బొజ్జ మహేశ్ తదితరులు ఉన్నారు.



కోదండ రామాలయంలోని మెట్లబావిని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

# వందశాతం లక్ష్యం దిశగా..

- ఆస్తి పన్ను వసూలు వేగవంతం
- రూ.43 కోట్లకు ఇప్పటివరకు రూ.33 కోట్లు వసూలు
- మొండి బకాయిలపై ఇందూరు నగరపాలక సంస్థ అధికారుల ప్రత్యేకదృష్టి
- ఈ నెలాఖరు వరకు 90 శాతం వడ్డీ మాఫీ



ఖలీల్‌వాడి, మార్చి 3: నిజామాబాద్ నగరపాలక సంస్థ ఆస్తి పన్ను వసూలు ప్రక్రియను వేగవంతం చేసింది. వందశాతం వసూలు చేయాలని ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని, ఆ దిశగా అధికారులు కృషి చేస్తున్నారు. ఆస్తి పన్ను వసూలులో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం ఉంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది బిజీగా ఉండడంతో ఆస్తి పన్ను వసూలుకు బ్రేక్ పడినట్లయ్యింది. త్వరలో లోక్‌సభ ఎన్నికల జరగనుండడంతో అంతలోపే ఆస్తి పన్ను వసూలు చేయాలని మున్సిపల్ అధికారులు కృతనిశ్చయంతో ఉన్నారు.

**వందశాతం లక్ష్యంగా..**

ఆస్తి పన్ను వందశాతం వసూలు చేయడమే లక్ష్యంగా నగరపాలక సంస్థ అధికారులు ముందుకెళ్తున్నారు. దీనికితోడు ఆస్తి పన్నులో 90శాతం వడ్డీని మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఆఫర్‌ను ఈనెలాఖరు వరకు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.పదిశాతం మాత్రమే వడ్డీ చెల్లించేలా వెసులుబాటు కల్పించి, యజమానులకు ఊరటనిచ్చింది. నిజామాబాద్ నగరపాలక సంస్థకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ. 43 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా..ఇప్పటివరకు రూ. 33 కోట్లు వసూలయ్యాయి. ఈ నెలాఖరు వరకు రూ.10 కోట్లు వసూలు చేయాలనే లక్ష్యాన్ని అధికారులు నిర్దేశించుకున్నారు. ప్రభుత్వ కల్పిస్తున్న వడ్డీ రాయితీని నగరవాసులకు తెలిసేలా ప్రచారం నిర్వహిస్తున్నారు.నిజామాబాద్ నగరపాలక సంస్థ పరిధిలో 82వేల గృహ, వాణిజ్య సముదాయాల నుంచి ఆస్తి పన్ను వసూలు చేయాల్సి ఉంది.

**భువన్ యాప్ ద్వారా నిర్మాణాల గుర్తింపు**

కార్పొరేషన్ పరిధిలో కొత్తగా తీసుకొచ్చిన భువన్ యాప్ ద్వారా ఆరు వేల సముదాయాలను పన్ను పరిధిలోకి తీసుకువచ్చారు. అదనంగా గదులు నిర్మించినా, ఒక భవంతిపై మరో భవంతి నిర్మించినా ఈ యాప్ ద్వారా కార్యాలయం నుంచే గుర్తించి పన్ను సవరించే అవకాశం ఉన్నది. ఈ విధంగా అదనంగా రూ. 5కోట్ల నుంచి రూ.6కోట్లు వసూలు చేయాల్సి ఉందని గుర్తించారు. నగరపాలక సంస్థ పరిధిలో 60 డివిజన్లలో 28 మంది రెవెన్యూ సిబ్బంది, 16 మంది బిల్లు కలెక్టర్లు ఉన్నారు. జోన్-3, జోన్-5 పరిధిలోకి వచ్చే మైనారిటీ ప్రాంతంలో ఇద్దరు ఆర్‌ఐలతో స్పెషల్ టీంలను ఏర్పాటు చేశారు. ఈ నెలాఖరులోపు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసేవిధంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. వడ్డీ రాయితీతో మరింత ఆదాయం రానున్నట్లు అధికారులు చెబుతున్నారు.

### వందశాతం వసూలు చేయడమే లక్ష్యం



నిజామాబాద్ నగరంలో వంద శాతం ఆస్తిపన్ను వసూలు చేసి రాష్ట్రంలో టాప్‌వన్‌గా నిలుస్తాం. ఇప్పటికే రూ.33 కోట్లు వసూలు చేశాం.మొండి బకాయిలను వసూలు చేయడంలో ప్రత్యేక బృందాలు నిమగ్నమయ్యాయి. ఈ నెలాఖరువరకు ప్రభుత్వం కల్పించిన వడ్డీ రాయితీని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

**- మకరంద్, కమిషనర్, నగరపాలక సంస్థ నిజామాబాద్**